# ప్రజా

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 248 పేజీలు : 04 వెల రూ. 2 ఆదివారం 05 - 04 - 2026





హైదరాబాద్‌లో కల్తీ మామిడి పండ్ల దందా..
200 కిలోలు సీజ్, వ్యాపారి అరెస్ట్!

# బాసర ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండాలి

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- బాసర ఆలయ పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా చూడాలి
- బాసర ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండాలన్న ముఖ్యమంత్రి
- భవిష్యత్తు అవసరాలు, రద్దీ దృష్ట్యా విశాలమైన రోడ్లు ఉండాలన్న సీఎం
- ఆలయ పరిసరాల్లో విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని సూచన



**హైదరాబాద్ :** బాసర ఆలయ పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా చూడాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ నెల 6వ తేదీన రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో, ఆలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్‌ను అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించారు. - మిగతా 2 లో

# ఐదు రాష్ట్రాల ఎన్నికల ఖర్చు కోసం ఇక్కడి నిధులు


2 లో

- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్
- ఐదు రాష్ట్రాల ఎన్నికల ఖర్చు కోసం ఇక్కడి నుంచి రేవంత్ రెడ్డి నిధులు తరలిస్తున్నారు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రూ. 600 కోట్లు మాత్రమే విడుదల చేశారన్న ఈటల
- ఇది పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటమే అని వ్యాఖ్య
- చట్టసభల్లో వ్యక్తిగత దూషణలకే ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపాటు


2 లో

# కేసీఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

- తీవ్రంగా స్పందించిన సబితా ఇంద్రారెడ్డి
- గజ్వేల్ క్యాంప్ కార్యాలయంపై దాడిని ఖండించిన సబితా ఇంద్రారెడ్డి
- సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని విమర్శ
- సీఎం హోదాలో ఉండి రౌడీ మాటలు మాట్లాడటం విడ్డూరమని వ్యాఖ్య

## ప్రజానాడి



# హర్మూజ్ దాటిన ఎల్పీజీ నౌక 'గ్రీన్ శాన్వి'

- గుజరాత్ మంత్రి ట్వీట్‌పై స్పందించిన ఇరాన్
- 46,650 మెట్రిక్ టన్నుల ఎల్పీజీతో హర్మూజ్ దాటిన గ్రీన్ శాన్వి
- భారత దౌత్యానికి మరో విజయమంటూ గుజరాత్ మంత్రి ట్వీట్
- భారత్‌తో స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటామన్న ఇరాన్



**ఢిల్లీ :** భారతదేశ జెండా కలిగిన గ్యాస్ కంటైనర్ 'గ్రీన్ శాన్వి', సుమారు 46,650 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ గ్యాస్‌తో హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. ఇంతకుముందు, మార్చి 28న 47,000 మెట్రిక్ టన్నుల పెట్రోలియం గ్యాస్‌తో - మిగతా 2 లో

# కేరళలో వచ్చేది ఎన్‌డీఏ ప్రభుత్వమే

- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- ఎల్‌డీఎఫ్‌కు ఇప్పటికే కౌంట్‌డౌన్ ప్రారంభమైంది
- కేరళలో ప్రధాని మోదీ ఎన్నికల ర్యాలీ
- ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటమిలపై విమర్శల జల్లు
- ఎన్నికల తర్వాత కేరళలో అతిపెద్ద మార్పు జరుగుతుందని, బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం
- మే 4న దశాబ్దాల దుష్పరిపాలన అంతం కానుంది



**కేరళ :** కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ నిష్క్రమణకు కౌంట్‌డౌన్ ప్రారంభమైందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఎన్నికల తర్వాత కేరళలో అతిపెద్ద మార్పు జరుగుతుందని, బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పతనంతిట్ట జిల్లాలోని తిరువళ్లలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు. కేరళ అభివృద్ధికి అవినీతి, మతతత్వం రెండు అతిపెద్ద అవరోధాలని ఈ సందర్భంగా చెప్పారు. శబరి రైలు ప్రాజెక్టును ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ఆలస్యం చేయడంతో తిరువళ్ల ప్రజలు తీవ్రంగా - మిగతా 2 లో

# కర్ణాటకలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ




- సైనిక్ స్కూల్ ప్రారంభం.. తెలుగువారికి అండగా ఉంటామన్న లోకేశ్
- కర్ణాటక సింధనూరులో శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవం
- కేంద్ర మంత్రులు కుమారస్వామి, సంజయ్ సేథ్ తో కలిసి పాల్గొన్న మంత్రి లోకేశ్
- తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రులు
- కష్టకాలంలో అండగా నిలిచిన తెలుగు ప్రజల రుణం తీర్చుకుంటామన్న లోకేశ్
- కార్యక్రమాల్లో పెద్దఎత్తున పాల్గొన్న స్థానిక తెలుగు ప్రజలు, ప్రముఖులు

**సింధనూరు :** కర్ణాటకలోని రాయచూర్ జిల్లా సింధనూరులో ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పర్యటించారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డీ కుమారస్వామి, కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌లతో కలిసి ఆయన పలు అభివృద్ధి, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హోసల్లీ క్యాంపులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవ వేడుకకు లోకేశ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులతో కలిసి ఆయన సైనిక్ స్కూల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేశ్‌కు నిర్వాహకులు, స్థానిక తెలుగు ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో బసవేశ్వర స్వామి విగ్రహాన్ని ఆవిష్కరించారు. శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్ హాస్టల్ భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన లోకేశ్, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులలో ఒకరైన దివంగత - మిగతా 2 లో

# 28 జిల్లాలతో ఏపీ కొత్త మ్యాప్!

- కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలు ఏర్పాటు
- మ్యాప్‌లో రాజధానిగా అమరావతికి అధికారిక గుర్తింపు
- పరిపాలనా సౌలభ్యమే లక్ష్యమన్న ప్రభుత్వం
- గతంలో 13 జిల్లాలుగా ఉన్న ఏపీ, వైఎస్ జగన్ హయాంలో 26 జిల్లాలుగా మారింది


2 లో


2 లో

# వైసీపీ అధినేతతో పాటు నాయకులకు కూడా మతిపోయినట్టుంది

- జనసేన ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు
- వైసీపీ అధినేతతో పాటు పార్టీ శ్రేణులు కూడా కామన్ సెన్స్ కోల్పోయాయని విమర్శ
- సాధారణంగా నేత దారితప్పితే రెండో శ్రేణి నాయకత్వం సరిదిద్దుతుందని వ్యాఖ్య
- కానీ వైసీపీలో అందరూ మతిస్థిమితం కోల్పోయారని ఎద్దేవా
- 'మావిగన్స్' కారణంగా వైసీపీ ఓ 'పిచ్చి' జోన్‌లోకి వెళ్లిందన్న నాగబాబు

# అమరావతి పనుల్లో వేగం పెంచండి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- గడువులో రాజీ లేదన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాజధాని నిర్మాణ పనులపై సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష
- రూ.57,821 కోట్లతో పనులు... వేగం పెంచాలని అధికారులకు సీఎం ఆదేశం
- గడువు విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- ఇది కాంట్రాక్ట్ కాదు, చరిత్రలో భాగస్వామ్యం అవుతున్నారన్న సీఎం
- మానవ వనరులను పెంచుకోవాలని నిర్మాణ సంస్థలకు కీలక సూచన



**అమరావతి :** అమరావతి రాజధాని నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ఆదేశించారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం రాజధాని నిర్మాణ పనులపై మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష - మిగతా 2 లో

# సంపాదకీయం

## బీసీ రిజర్వేషన్ల బిల్లుపై చిత్తశుద్ధి ఏదీ?

తొలి దశ జనగణన ఈ ఏడాది మొట్టమొదటగా డిజిటల్ విధానంలో చేపడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆరువేల కోట్లు కేటాయించి, 33 ప్రశ్నలతో కూడిన గెజిట్‌ను విడుదల చేసింది. ఆ ప్రశ్నావళిలోని 12వ కాలమ్‌లో ఎస్సీ, ఎస్టీ, ఇతరులు అని పేర్కొన్నారు. కానీ దేశంలో 60 శాతం ఉన్న ఓబీసీల జనాభా లెక్కింపు కోసం ప్రత్యేక కాలమ్ లేదు. ప్రజలు ఏ ఇంట్లో ఉంటున్నారు? ఆ ఇంటి నిర్మాణంలో ఏ మెటీరియల్ వాడారు? ఆ ఇంటి నేల, గోడ, పైకప్పు ఏ రకం? ఏ రకమైన ఆహారం తింటున్నారు? ఏ నీళ్లు తాగుతున్నారు? ఏ పొయ్యి వాడుతున్నారు? టీవీ, కంప్యూటర్, టూవీలర్స్, కార్లు, ఇంటర్నెట్ సౌకర్యాలు లాంటి డేటా సేకరిస్తున్నారు. మంచిదే కానీ, బీసీల డేటా సేకరించలేరా?సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, వ్యాపారాల్లో తీవ్ర అసమానతలు ఎదుర్కొంటున్న, ఉత్పత్తి కులాలైన ఓబీసీలకు చట్టబద్ధంగా రావలసిన రిజర్వేషన్లు అందుకోవడానికి బీసీ సమాజం ఎందుకు ఇంకా బలహీనంగా పోరాడుతోంది? బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తే భవిష్యత్తులో గ్రామాలలో, పట్టణాలలో అగ్రకులాల ప్రాబల్యం, ఆధిపత్యం, పెత్తందారి నియంతృత్వానికి భారీగా గండిపడుతుంది. బీసీలు భవిష్యత్తులో చట్టసభలలోకి ప్రవేశిస్తే దేశ, రాష్ట్ర రాజకీయాలలో ఓబీసీల ఆధిపత్యం పెరుగుతుందనే భయం ఉంది. అందుకే అగ్రకులాలు రాజకీయంగా, కోర్టుల ద్వారా రిజర్వేషన్లను అడ్డుకుంటున్నాయి.విచిత్రం ఏమిటంటే తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లకు అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయి. బీజేపీ ఈసారైనా పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్లో చేర్చి మండల్ కమిషన్ చెప్పినట్లు వారికి విద్యా, ఉద్యోగ, రాజకీయాలలో 52శాతం రిజర్వేషన్లు ఇచ్చే విషయంపై చర్చ పెట్టాలి. రాష్ట్రస్థాయిలో బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చుకోవచ్చని చెప్పింది బీజేపీ. ఆ బిల్లును రాష్ట్రపతి, ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఇంతవరకు ఆమోదించలేదు. ఇది పార్లమెంట్‌లో చట్టం చేయాల్సిన అంశమని, బీజేపీ రాష్ట్ర నాయకులు కేంద్రంలో పెద్దలకు ఎందుకు చెప్పి ఒప్పించలేకపోతున్నారు? 42శాతం బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా అగ్రకులాలు కోర్టులో పిటిషన్ వేస్తే, బీసీలకు మద్దతుగా ఇంప్లీడ్ పిటిషన్లు కూడా వేయని పార్టీలు బీజేపీ, బీఆర్ఎస్ మాత్రమే.ఇందిరా సహాని కేసులో సుప్రీంకోర్టు విద్య, ఉద్యోగాలలో మాత్రమే రిజర్వేషన్లు 50శాతం పరిమితి మించరాదని చెప్పింది. ఎక్కడా రాజకీయ రిజర్వేషన్ల గురించి మాట్లాడలేదు. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రపతికి, గవర్నర్‌కు పంపిన బిల్లుల విషయంలో పరిమిత గడువులోపు వారు ఆమోదించడమో, వ్యతిరేకించడమో చేయాలి. లేకపోతే ఆ బిల్లు ఆటోమేటిక్‌గా చట్టంగా మారుతుంది. ఆ మార్గదర్శకాలను హైకోర్టు పాటించకపోవడం రాజ్యాంగ విరుద్ధం కాదా? సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చూస్తే రిజర్వేషన్లు 50శాతం పరిమితి దాటొద్దు కానీ కేంద్రంలో బీజేపీ, తెలంగాణలో కేసీఆర్ వల్ల విద్య, ఉద్యోగాల్లో 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇవ్వడంతో మొత్తంగా 60శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఇక్కడ సుప్రీంకోర్టు గత తీర్పు వర్తించదా!ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలలో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు తప్ప మిగతా మెజారిటీ సీట్లలో అగ్రకులాలదే ఆధిపత్యం. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50శాతం రాజకీయ రిజర్వేషన్లు ఉంటే, 10శాతం లేని ఓసీలు మిగిలిన సీట్లన్నీ అనుభవిస్తున్నారు. దీన్ని ఎలా అనుమతిస్తాయి కోర్టులు? ఇది రాజ్యాంగపరంగా సమన్యాయమేనా? ఓబీసీలకు 42శాతం, ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 10శాతం రిజర్వేషన్లు ఇచ్చినా 67శాతం అవుతుంది. ఇక మిగిలిన 33శాతం సీట్లను 10 శాతం కూడా లేని ఓసీలే అనుభవిస్తారు కదా! ఏ రకంగా చూసినా ఎక్కువ ప్రయోజనం పొందేది అగ్రకులాలే! దీనిని కోర్టులు ఎందుకు గమనించడం లేదు?ఇంకో విషయం ఏమిటంటే ట్రిపుల్ టెస్ట్ చేయాలి అంటున్నాయి కోర్టులు. అసలు ఈ ట్రిపుల్ టెస్ట్‌లో ఏముందంటే 1) స్థానికంగా ఓబీసీల సమగ్ర వివరాలు సేకరించాలి, దానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి. 2) కమిషన్ అధ్యయనం తర్వాత రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించాలి. 3) మొత్తం రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదు. మూడో పాయింట్‌కు సంబంధించి బీసీల ఎంపిరికల్ డేటా ప్రకారం పెంచాలని ఉన్నా, అది 50శాతం దాటొద్దు. మరి పెరిగిన బీసీల జనాభా డేటాతో రిజర్వేషన్లు పెంచకపోతే, సేకరించిన ఆ డేటాతో పని ఏం ఉంటుంది? 50శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వనప్పుడు ఆ ట్రిపుల్ టెస్ట్ అవసరమే లేదు. మిగతా సామాజికవర్గాలతో పాటు ఓసీలకు కూడా విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో వారి జనాభా ఎంతో అంత రిజర్వేషన్లు ఇవ్వాలి.బీజేపీ తక్షణమే పార్లమెంటులో బీసీ బిల్లును తొమ్మిదో షెడ్యూల్లో పెట్టి, దేశవ్యాప్తంగా ఓబీసీల జనాభా ఎంత ఉందో, అంత శాతం రిజర్వేషన్లు విద్యా, ఉద్యోగ, రాజకీయాలలో కల్పించాలి. లేకపోతే ఆ పార్టీ భవిష్యత్తును వారే ప్రమాదంలో పడవేసుకున్నట్టు అవుతుంది.

# అమరావతి పనుల్లో వేగం పెంచండి



**మొదటిపేజీ తరువాయి** – నిర్వహించారు.ప్రస్తుతం రాజధానిలో వివిధ దశల్లో ఉన్న రూ.57,821 కోట్ల విలువైన పనుల పురోగతిని ముఖ్యమంత్రి క్షుణ్ణంగా సమీక్షించారు. హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ మౌలిక వసతులతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణంపై చర్చించారు. గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన పనులను తిరిగి ప్రారంభించే క్రమంలో ఎదురైన సవాళ్లను, పెరిగిన నిర్మాణ వ్యయాన్ని అధిగమించి టెండర్లు పూర్తి చేసి పనులు అప్పగించిన తీరును అధికారులు సీఎంకు వివరించారు. ప్రస్తుతం రాజధానిలో 20 వేల మంది కార్మికులు, నిపుణులు పనిచేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... "రాజధాని నిర్మాణం అనేది కేవలం ఒక కాంట్రాక్ట్ వర్క్ కాదు. ఈ బృహత్కార్యంలో పాలుపంచుకుంటున్న మీరంతా చరిత్రలో భాగస్వాములు అవుతున్నారు. ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉండొచ్చు, కానీ ఒక రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీ దక్కదు" అని అన్నారు. అమరావతిని ప్రపంచ స్థాయి 'ఫ్యూచర్ సిటీ'గా నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని క్షేత్రస్థాయిలో సాకారం చేయాల్సిన బాధ్యత నిర్మాణ సంస్థలదేనని స్పష్టం చేశారు.ప్రతి నిర్మాణ సంస్థ నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు, నెలవారీ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు. ఎంత మంది కార్మికులు, ఎంత యంత్ర సామగ్రి అవసరం, ప్రస్తుతం ఎంత వాడుతున్నారనే వివరాలను ఆరా తీశారు. వర్షాకాలం సమీపిస్తున్నందున పూర్తి చేయాల్సిన పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నిర్మాణాల్లో నాణ్యత, వ్యయ నియంత్రణ, గ్రీన్ ఎనర్జీ, ఆధునిక టెక్నాలజీ వినియోగం తప్పనిసరి అని స్పష్టం చేశారు. పనుల పూర్తి కోసం అవసరమైతే మానవ వనరులను పెంచుకోవాలని, ప్రతి నిర్మాణం సకాలంలో పూర్తి చేసి ప్రారంభించుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

# కర్ణాటకలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

**మొదటిపేజీ తరువాయి** – డాక్టర్ దండమూడి రాధాకృష్ణ జ్ఞాపకార్థం నిర్మించిన 'డా. రాధాకృష్ణ కళాధామ' ఓపెన్ ఆడిటోరియంను వర్చువల్‌గా ప్రారంభించారు.

**ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ.. తెలుగు వారికి అండగా ఉంటామని భరోసా**

అనంతరం సింధనూరు గంగావతి రోడ్డులోని తెలుగు సంఘం కళ్యాణమండపంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహాన్ని కేంద్ర మంత్రులు కుమారస్వామి, సంజయ్ సేథ్‌లతో కలిసి మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. "చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసిన క్లిష్ట సమయంలో సింధనూరు, రాయచూర్‌లోని తెలుగు ప్రజలు మాకు అండగా నిలిచారు. మీ రుణం తీర్చుకునేందుకే ఇక్కడికి వచ్చాను. తెలుగువారు ప్రపంచంలో ఎక్కడున్నా తెలుగుదేశం పార్టీ వారికి అండగా ఉంటుంది" అని లోకేశ్ స్పష్టం చేశారు. అనంతరం మంత్రి లోకేశ్‌ను స్థానిక తెలుగు సంఘం నాయకులు శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమాల్లో విశాఖ ఎంపీ శ్రీభరత్, కర్ణాటక మంత్రులు శరణ్ ప్రకాశ్ పాటిల్, శివరాజ్ తంగడగి, ఎన్.ఎస్. బోసురాజు, సింధనూరు ఎమ్మెల్యే హంపనగౌడ బాదర్లీ, శ్రీకృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ బి.వెంకటరావు, సంస్థ డైరెక్టర్లు, స్థానిక తెలుగు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వైసీపీ అధినేతతో పాటు నాయకులకు కూడా మతిపోయినట్టుంది

**మొదటిపేజీ తరువాయి** - వైసీపీ అధినేతతో పాటు ఆ పార్టీ నాయకత్వం, శ్రేణులు కూడా తమ కామన్ సెన్స్ (విచక్షణ) కోల్పోయాయని జనసేన ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. వైసీపీ మొత్తం ఒక 'పిచ్చి' జోన్‌లోకి ప్రవేశించిందని ఆయన ట్వీట్ చేశారు.''రాజకీయాల్లో నేను గమనించిన ఒక సాధారణ విషయం ఏమిటంటే.. ఏదైనా పార్టీలో అగ్ర నాయకుడు దారి తప్పినా, విచక్షణ కోల్పోయినా.. రెండో శ్రేణి నాయకత్వం వెంటనే రంగంలోకి దిగి నష్టాన్ని సరిదిద్దడానికి ప్రయత్నిస్తుంది. పార్టీని, నాయకుడిని తిరిగి సరైన మార్గంలో పెట్టేందుకు కృషి చేస్తుంది. ఇది చాలా సహజంగా జరిగే ప్రక్రియ.కానీ, వైసీపీ విషయంలో మాత్రం ఒక విచిత్రమైన, ప్రమాదకరమైన పరిస్థితి నాకు కనిపిస్తోంది. ఇక్కడ పార్టీ అధినేత తన విచక్షణ, ఇంగిత జ్ఞానం పూర్తిగా కోల్పోయారు. అయితే, ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఆయన్ను సరిదిద్దాల్సిన రెండో శ్రేణి నాయకత్వం, కింది స్థాయి కేడర్ కూడా తమ బుర్రలకు పనిచెప్పడం మానేశారు. నాయకుడు ఏం చేస్తే అదే కరెక్ట్ అన్నట్లుగా గుడ్డిగా అనుసరిస్తున్నారు.దీని ఫలితంగా 'మావిగన్' అని పిలుచుకునే ఈ మొత్తం పార్టీ ఒకరకమైన ఉన్మాద స్థితిలోకి ప్రవేశించినట్లు అనిపిస్తోంది. ఒకరి తర్వాత ఒకరు చేస్తున్న వ్యాఖ్యలు, వారి ప్రవర్తనా శైలి చూస్తుంటే ఇదే నిజమనిపిస్తుంది. ఒక వ్యవస్థలో అందరూ ఆలోచించడం మానేస్తే అది ఎంత ప్రమాదకరమో అర్థం చేసుకోవచ్చు. అందుకే ప్రజలు ఈ పరిణా మాలను చాలా జాగ్రత్తగా గమనించాలని, అత్యంత అప్రమత్తంగా ఉండాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు.



# కేరళలో వచ్చేది ఎన్‌డీఏ ప్రభుత్వమే

**మొదటిపేజీ తరువాయి** –

నష్టపోయారని ప్రధాని ఆరోపించారు. కేరళకు అపారమైన సామర్థ్యం ఉన్నప్పటికీ, అభివృద్ధి పరుగులో ఇతర రాష్ట్రాల కంటే వెనుకబడి ఉందని పేర్కొన్నారు. ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ ప్రభుత్వాలు సరైన శ్రద్ధ చూపకపోవడం వల్ల కేరళ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు అధ్వాన్నంగా ఉన్నాయని మోదీ ఆరోపించారు. కేరళలో బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని అడ్డంకులు తొలగిపోతాయని చెప్పారు. పశ్చిమాసియాలో పరిస్థితిపై కాంగ్రెస్ అనవసర ఆందోళనలు రేకెత్తిస్తోందని ప్రధాని విమర్శించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం కంటే ఎన్‌డీఏ ప్రభుత్వం కేరళ అభివృద్ధి కోసం ఐదు రెట్లు అధికంగా నిధులు ఖర్చు చేసిందని వివరించారు."నేను ఇంతకు ముందు కూడా ఇక్కడికి వచ్చాను. కానీ ఈసారి మార్పు గాలులు మరో దిశలో వీస్తున్నాయి. కేరళ ప్రజల మూడ్ మారినట్టు కనిపిస్తోంది. కేరళలో అతిపెద్ద మార్పు జరగబోతోంది. ఏప్రిల్ 9న పోలింగ్ జరుగుతుంది. మే 4న దశాబ్దాల దుష్పరిపాలన అంతం కానుంది. ఎల్డీఎఫ్ ప్రభుత్వ నిష్క్రమణకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. కేరళలో మొదటిసారిగా బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాబోతోంది.తనను రాజకీయంగా దెబ్బతీయడం కోసం, పశ్చిమా సియా దేశాలతో భారత్‌కు ఉన్న సంబంధాలను చెడగొట్టేలా కాంగ్రెస్ రెచ్చగొట్టే వ్యాఖ్యల చేస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు కేవలం ఎన్నికల్లో గెలవడం తప్ప మరో ధ్యాస ఉందని విమర్శించారు. "నేను ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలని అనుకుం టున్నాను. ఎన్నికలు వస్తుంటాయి, పోతుం టాయి. కానీ భారతీయుల రక్షణ, ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉన్న కేరళ ప్రజల భద్రత మా ప్రథమ ప్రాధాన్యత. వారిని రక్షించే బాధ్యతను నేను తీసుకుంటాను" అని ఎన్‌డీఏ ర్యాలీలో ఆయన పేర్కొన్నారు."గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న లక్షలాది మంది కేరళ ప్రజలతోపాటు, యుద్ధం కారణంగా ఇరాన్ సహా ఇతర ప్రాంతాల్లో చిక్కుకుపోయిన గోవా, తమిళనాడు సహా ఇతర రాష్ట్రాల మత్స్యకా రుల గురించి కూడా మోదీ ప్రస్తావించారు. మేము వారందరినీ సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. కానీ కాంగ్రెస్ పార్టీకి దీని గురించి పట్టదు. పశ్చిమాసియా దేశాలతో భారత సంబంధాలు దెబ్బతీసేలా, అనవసర భయాందోళనలను సృష్టించేలా కాంగ్రెస్ ప్రకటనలు చేస్తోంది. ఇదంతా కేవలం నాపై రాజకీయ దాడులు చేయడానికే. వారికి కేవలం రాజకీయం, అధికారం మీదే కాంక్ష ఉంది. భారత ప్రజల పట్ల వారికి ఎలాంటి పట్టింపు లేదు. వాళ్లు కేరళ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారు. దీనికి వాళ్లు కేరళ ప్రజలకు, దేశానికి క్షమాపణ చెప్పాలి" అని మోదీ పేర్కొన్నారు. ఇంతకు ముందు వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ, ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ ఆయన పిరికివాడు అని విమర్శించారు. తనను తాను రక్షించుకునేందుకు ఆయన అమెరికా, ఇజ్రాయెల్ ముందు తలవంచారని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే మోదీ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. "లక్షలాది మంది కేరళవాసులు పశ్చిమాసియాలో పనిచేస్తున్నారు. అయినా కాంగ్రెస్ నేతలు బాధ్యతారాహిత్యంగా ప్రకటనలు చేస్తూ, వారి భద్రతను ప్రమాదంలో పడేస్తున్నారు. పశ్చిమాసియాలో నివసిస్తున్న భారతీయులను ప్రమాదంలోకి నెట్టే వ్యాఖ్యలు చేయవద్దని నేను కాంగ్రెస్ నేతలను కోరుతున్నాను. గల్ఫ్ దేశాలతో మా ప్రభుత్వానికి ఉన్న బలమైన సంబంధాలే ఈ కష్టకాలంలో మన ప్రజలను రక్షించడానికి సహాయపడుతున్నాయి" అని అన్నారు.

# 28 జిల్లాలతో ఏపీ కొత్త మ్యాప్!

**మొదటిపేజీ తరువాయి** – ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 28కి పెరిగింది. పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర పటంలో మార్పులు చేసిన ప్రభుత్వం, రెండు కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు 28 జిల్లాలతో కూడిన నూతన మ్యాప్‌ను ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ అధికారికంగా విడుదల చేసింది. ఈ మ్యాప్‌లో రాష్ట్ర రాజధానిగా అమరావతిని స్పష్టంగా పేర్కొనడం గమనార్హం.ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతాలను వేరు చేస్తూ మార్కాపురం కేంద్రంగా ఒక జిల్లాను, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలతో పోలవరం కేంద్రంగా మరో జిల్లాను ఏర్పాటు చేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకు, అభివృద్ధిని వికేంద్రీకరించే లక్ష్యంతోనే ఈ పునర్విభజన చేపట్టినట్లు ప్రభుత్వం చెబుతోంది.గతంలో 13 జిల్లాలుగా ఉన్న ఏపీ, వైఎస్ జగన్ హయాంలో 26 జిల్లాలుగా మారింది. తాజాగా ఈ సంఖ్య 28కి చేరింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సేవలు మరింత వేగంగా అందుబాటులోకి వస్తాయని అధికారులు ఆశిస్తున్నారు. ముఖ్యంగా రాజధాని విషయంలో కొంతకాలంగా నెలకొన్న సందిగ్ధతకు తెరదించుతూ, అధికారిక మ్యాప్‌లో అమరావతిని రాజధానిగా చేర్చడం ఈ ప్రకటనలో కీలక పరిణామం.

# కూలిపోయిన చైనా రాకెట్



**మొదటిపేజీ తరువాయి** – అంతరిక్ష రంగంలో దూసుకెళ్తున్న చైనాకు ఎదురుదెబ్బ తగిలింది. దేశంలోని ప్రైవేట్ అంతరిక్ష సంస్థ 'స్పేస్ పయనీర్' చేపట్టిన ప్రతిష్ఠాత్మక 'తియాన్‌లాంగ్-3' రాకెట్ ప్రయోగం విఫలమైంది. ఏప్రిల్ 3న జరిగిన ఈ పరీక్షలో, రాకెట్ నింగిలోకి ఎగిరిన కొద్దిసేపటికే సాంకేతిక లోపంతో కుప్పకూలింది.స్పేస్ ఎక్స్ సంస్థకు చెందిన 'ఫాల్కన్ 9' రాకెట్‌కు పోటీగా తియాన్‌లాంగ్-3ని రూపొందించారు. భారీ పేలోడ్‌లను మోసుకెళ్తూ, తిరిగి భూమిపైకి వచ్చి ల్యాండ్ అయ్యే పునర్వినియోగ టెక్నాలజీతో దీనిని తయారుచేశారు. డాంగ్‌ఫెంగ్ ఏరోస్పేస్ ఇన్నోవేషన్ సెంటర్ నుంచి ప్రయోగించిన కొన్ని నిమిషాలకే రాకెట్ తన గమ్యం నుంచి వైదొలిగి, నిర్దేశిత కక్ష్యను చేరుకోలేకపోయింది. రాకెట్ మొదటి దశ విడిపోయే క్రమంలో లేదా ఇంజిన్ పనితీరులో తలెత్తిన సమస్య వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు.ఈ వైఫల్యంపై స్పేస్ పయనీర్ సంస్థ విచారం వ్యక్తం చేసింది. "తొలి ప్రయత్నంలో ఆశించిన ఫలితం రాకపోవడం బాధాకరం. మా భాగస్వాములకు, శాస్త్రవేత్తలకు క్షమాపణలు చెబుతున్నాము. ఈ వైఫల్యం నుంచి పాఠాలు నేర్చుకుని, తదుపరి మిషన్లను మరింత పటిష్ఠంగా నిర్వహిస్తాము" అని సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది.ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య అంతరిక్ష ప్రయోగాల మార్కెట్‌లో పట్టు సాధించాలని చైనా గట్టిగా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో అక్కడి ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో తియాన్‌లాంగ్-3 వైఫల్యం చైనా ప్రైవేట్ అంతరిక్ష కార్యక్రమాలకు తాత్కాలిక అవరోధంగా నిలిచింది.

# హర్మూజ్ దాటిన ఎల్పీజీ నౌక 'గ్రీన్ శాన్వి'

**మొదటిపేజీ తరువాయి** – కూడిన నౌక గుజరాత్, జామ్‌నగర్‌లోని కాండ్లాలో గల వాడినార్ టెర్మినల్‌కు చేరుకుంది. ఇప్పుడు ఎల్పీజీతో కూడిన గ్రీన్ శాన్వి మరికొద్ది రోజుల్లో భారత్‌కు చేరుకోనుంది.ఈ మేరకు గుజరాత్ మంత్రి హర్ష్ సింఘ్వీ 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. "ఎల్పీజీ నౌక గ్రీన్ శాన్వి విజయవంతంగా హర్మూజ్ జలసంధిని దాటింది. భారత దౌత్యానికి ఇది మరో విజయం" అని పేర్కొన్నారు.మంత్రి ట్వీట్‌పై ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ స్పందించింది. భారత్‌తో స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపింది. శతాబ్దాల క్రితం మా ప్రాంతం నుంచి వచ్చిన వారికి భారత్, ముఖ్యంగా గుజరాత్ సాదరంగా స్వాగతం పలికాయని, కాబట్టి మా చరిత్రలో వీటికి విశిష్ఠ స్థానం ఉందని పేర్కొంది. ఈ సుదీర్ఘ నాగరికత అనుబంధాన్ని పునాదిగా చేసుకుని, స్నేహం, సహకార సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి కట్టుబడి ఉన్నామని పేర్కొంది.భారత్ జెండాతో కూడిన ఎనిమిది నౌకలు ఇప్పటి వరకు హర్మూజ్ జలసంధిని దాటాయి. మరో 15 నౌకలు అక్కడే ఉండిపోయాయి. ఆ నౌకలను సురక్షితంగా భారత్ తీసుకురావడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కేంద్రం తెలిపింది.

# బాసర ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండాలి

**మొదటిపేజీ తరువాయి** – అధికారులకు ఆయన కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, బాసర ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండాలని సూచించారు.భవిష్యత్తు అవసరాలు, రద్దీ దృష్ట్యా విశాలమైన రోడ్లు ఉండేలా చూడాలని అన్నారు. ఆలయ పరిసరాల్లో విద్యుత్ వాహనాలు ఉపయోగించేలా చూడాలని పేర్కొన్నారు. ఆలయ పవిత్రతకు భంగం వాటిల్లకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని సూచించారు.

# ఐదు రాష్ట్రాల ఎన్నికల ఖర్చు కోసం ఇక్కడి నిధులు



**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాలపై ఆయన పలు ప్రశ్నలు సంధించారు. తెలంగాణ ప్రజల సంపదను రేవంత్ రెడ్డి కొల్లగొడుతున్నారని, ఐదు రాష్ట్రాల ఎన్నికల ఖర్చు కోసం ఇక్కడి నిధులను తరలిస్తున్నారని ఈటల సంచలన ఆరోపణలు చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఇవ్వలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రెండున్నర ఏళ్లలో కేవలం రూ. 600 కోట్లు మాత్రమే విడుదల చేసిందని మండిపడ్డారు. ఇది పేద విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటమేనని ధ్వజమెత్తారు.ఎన్నికల వేళ 6 గ్యారెంటీలు, 66 హామీలతో ప్రజలను మోసం చేశారని, చట్టసభల్లో ప్రజా సమస్యల కంటే వ్యక్తిగత దూషణలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఈటల ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులతో చేతులు కలిపి సీఎం అమ్ముకుంటున్నారని ఆరోపించారు.

# కేసీఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి



**మొదటిపేజీ తరువాయి** – మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడి ఘటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రంగా స్పందించారు. సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి ఫొటోతో క్యాంప్ కార్యాలయంలోకి దూసుకెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలు, అక్కడ ముఖ్యమంత్రి ఫొటోను ఉంచారు. అనంతరం కార్యాలయంలో జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు.గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడిని సబితా ఇంద్రారెడ్డి ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యల కారణంగానే కాంగ్రెస్ కార్యకర్తలు ఇలా రెచ్చిపోతున్నారని ధ్వజమెత్తారు. మా దగ్గర కూడా కండలు తిరిగినవాళ్లు ఉన్నారంటూ అసెంబ్లీలో ముఖ్యమంత్రి అన్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఇలాంటి రౌడీ మాటలు మాట్లాడటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు.కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉండేవని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై పట్టపగలే దాడులు జరుగుతుంటే పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని ఆరోపించారు. ఈ దాడికి పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

# ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం.. భారీగా పెరిగిన ఆహార ధరలు

పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో, అంతర్జాతీయంగా ఆహార ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. చమురు, ఇంధన ధరల కొరత, పెరుగుదల ప్రభావం నిత్యావసర వస్తువులపై పడుతోంది. అంతర్జాతీయ ఆహార ధరల సూచీ ఆరు నెలల గరిష్ఠానికి చేరుకుంది. ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే ఆహార ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఆందోళన వ్యక్తం చేసింది.ఈ మేరకు నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం ఆహార ధరలు ఫిబ్రవరితో పోలిస్తే మార్చి నెలలో 2.4 శాతం పెరిగి 128.5 పాయింట్ల గరిష్ఠస్థాయికి చేరుకున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఇది ఒక శాతం అధికం. ఫిబ్రవరితో పోలిస్తే మార్చి నెలలో వంట నూనెలు 5.1 శాతం, చక్కెర 7.2 శాతం, గోధుమలు 4.3 శాతం పెరిగాయి. ఎరువులు, మొక్కజొన్న ధరలు కూడా పెరిగాయి. అయితే యుద్ధ సమయంలో, బియ్యం ధరలు మాత్రమే తగ్గుముఖం పట్టాయి.



# గ్రామ సభలు వార్డు సభల పేరుతో ప్రజాధనం వృధా తొలి జడ్పీ చైర్ పర్సన్ వసంత



**జగిత్యాల ఏప్రిల్ 4(ప్రజా మంటలు) :**సమస్యలకు పరిష్కారం లేని సభలు ఎందుకు...?జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బి ఆర్ ఎస్ నాయకులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జరిగినటువంటి గ్రామసభలు మరియు వార్డు సభలు ఎందుకోసం ఎవరి కోసం జరిపినట్టు అని ప్రశ్నించారు. గతంలో ప్రజాపాలన పేరు మీద దరఖాస్తులు తీసుకొని ఒక్కదాని కూడా సమస్యకు పరిష్కారం దొరికిందా అని అన్నారు. గ్రామసభలు వార్డు సభలో ప్రభుత్వం ప్రజలకు జవాబుదారితనంగా ఉండాలి కానీ ఏదో నామమాత్రంగా సభలు నిర్వహించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం ఏ ఒక్క హామీ అయినా అమలు అయిందా అని అన్నారు. బిఆర్ఎస్ హయంలో ఇచ్చిన పెన్షన్లు రుణమాఫీ రైతుబంధు కళ్యాణ లక్ష్మి మొన్న జరిగిన గ్రామసభల్లో చెప్తున్నారు. ఇచ్చిన హామీలు వందరోజులు అమలు చేస్తా అన్నావ్ కానీ ఇంతవరకు ఒక్కటి కూడా అమలు కాలేదు అని అన్నారు. గ్రామ సభలు పెట్టడానికి అధికారులు మరియు ప్రజాప్రతినిధులు వెనుకడుగు వేస్తున్నారని ఎందుకంటే ఒక హామీ కూడా అమలు చేయలేదు ప్రజలకు ఏమి జవాబు చెప్పాలని. మార్పు మార్పు అని రేవంత్ రెడ్డినీ గెలిపిస్తే తెలంగాణలో ఏం మార్పు వచ్చిందని అన్నారు ఎంతమంది ఆడబిడ్డలకు మహా లక్ష్మీ పతకం కింద రూ.2500 మరియు కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారంతో పాటు లక్ష రూపాయలు చెక్కు ఇచ్చారు అని అన్నారు.రేవంత్ రెడ్డి కేరళలో ఎన్నికల ప్రచారం చేస్తూ తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేశాడని చెప్తున్నాడు తెలంగాణలోని కొడంగల్ నియోజకవర్గానికి వచ్చి ఆరు గ్యారంటీలు అమలు చేశాం అని చెప్పు దమ్ము రేవంత్ రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు కాంగ్రెస్ ప్రభుత్వానివిద్య భరోసా కింద ఐదు లక్షల పథకం జగిత్యాల నియోజకవర్గం లో ఎంత మంది విద్యార్థులకు అమలైందని ప్రశ్నించారు.జగిత్యాల నియోజక వర్గ ప్రజలందరూ కేసీఆర్ కావాలని ఎమ్మెల్యే నీ గెలిపించుకుంటే గెలిచిన ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి కావాలని కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు అని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారితనంగా ఉన్నప్పుడే సభలు నిర్వహించాలని అర్జీలు పెట్టుకుంటే సమస్యకు పరిష్కారం దొరికే విధంగా ఉండాలని అన్నారు. వార్డు సభలు గ్రామసభలు గందరగోళంగా ఉన్నాయని అన్నారు. కెసిఆర్ కుటుంబాన్ని బిఆర్ఎస్ పార్టీని తిట్టడం తప్ప ఈ రెండున్నర సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి చేసింది ఏమీ లేదు అని అన్నారు. ప్రజలు చీకోడుతున్నారని ప్రజలలో అతి తక్కువ కాలంలో వ్యతిరేకత సాధించుకున్న పార్టీ ఏదైనా ఉందా అంటే అది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. గ్రామసభలో వార్డ్ సభల పేరిట కొత్త నాటకం తెరలైపోయారు తప్ప దానివల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని ప్రభుత్వ ధనం వృధా అవుతుంది అని అన్నారు. మోసపూరిత మాటలకు ప్రజలు ఆశపడి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అన్నారు. వార్డు సభల పేరిట ప్రజల దృష్టి మళ్లించి డైవర్షన్ పాలిటిక్స్ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని అన్నారు.కొట్లాడి సాధించుకున్న తెలంగాణను 10 సంవత్సరాలు కేసీఆర్ గారు బంగారు తెలంగాణ చేస్తే తెలంగాణ ద్రోహి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని అన్నారు. కెసిఆర్ నాయకత్వంలో ప్రజల గొంతుకై ప్రభుత్వాన్ని ఎల్లవేళలా ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అయిల్నేని వెంకటేశ్వర్ రావు కౌన్సిలర్ లు దేవేందర్ నాయక్ హరీష్ మాజీ పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి జగిత్యాల రూరల్ మరియు అర్బన్ మండల అధ్యక్షుడు అయిల్నేని ఆనంద్ రావు తుమ్మ గంగాధర్ నాయకులు గంగారం హరీష్ గంగారెడ్డి గంగాధర్ అనురాధ బొల్లారాపు కళ్యాణి నవీన్ ఆరుముల్ల మానస శివకుమార్ నాయకులు తదితరులు ఉన్నారు.

# మొక్క జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన

## జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**జగిత్యాల ఏప్రిల్ 4(ప్రజా మంటలు) :**తెలంగాణ రాష్ట్ర మార్క్ ఫెడ్ కరీంనగర్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆద్వర్యం లో జగిత్యాల వ్యవసాయ మార్కెట్ లో మొక్క జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ఎమ్మెల్యే మాట్లాడుతూరాష్ట్ర ఆర్థిక పరిస్థితి కొంత ఇబ్బందిగా ఉన్నా అన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేయడం జరుగుతుందన్నారు.జిల్లా లో 46 వేల ఎకరాల్లో,నియోజకవర్గం 14 వేల ఎకరాల్లో మొక్క జొన్న పంట సాగు చేశారు.రైతులకు ఇబ్బంది లేకుండావ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ని కోరగానే సానుకూలంగా స్పందించి మక్కల కొనుగోలు కేంద్రాలు మంజూరు చేయటం జరిగిందన్నారు.కేంద్రం మద్దతు ధర 2400 గా పెట్టినా కేంద్రం మక్కలు కొనుగోలు చేయటం లేదు.మొక్కజొన్న పంట కేంద్రం కొనుగోలు చేయాలి మద్దతు ధర అందజేయాలి.తెలంగాణ మార్క్ ఫెడ్ 10 వేల కోట్ల నష్టాల్లో ఉంది.రైతు పక్షపాతి ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం.రైతులు ఒకే రకమైన వరి లాంటి పంట కాకుండా ఇతర పంటల సాగుపై మొగ్గు చూపాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ ఏ ఎంసీ ఛైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ మాజీ ఏ ఎం సి ఛైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి మార్కెటింగ్ ఏ డి ప్రకాష్ డి ఏ ఓ భాస్కర్ మార్క్ ఫెడ్ డి ఎం హబిబ్ ఎమ్మెర్వో రామ్మోహన్ ఏ ఎం సి వైస్ చైర్మన్ సయ్యద్ అఖిల్,చిక్కులభూమయ్య ,మహేశ్వర్ రావు, బాలే శంకర్, సురేందర్ నాయక్, ఏ ఎం సి డైరెక్టర్ లు,కౌన్సిలర్ లు,సర్పంచులు, నాయకులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మీకు మంత్రి పదవి ఇస్తే పార్టీని వదిలి వెళ్లేవారా

## డిసిసి అధ్యక్షుడు నందయ్య



**జగిత్యాల ఏప్రిల్ 4 (ప్రజా మంటలు) :**మీకు మంత్రి పదవి ఇస్తే పార్టీని వదిలి వెళ్లేవారా అని సూటిగా ప్రశ్నించారు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందయ్య జీవన్ రెడ్డిని ఉద్దేశించిజిల్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డిపై విమర్శల అస్త్రాలు ఎక్కు పెట్టారు.కాంగ్రెస్ లో ఉన్నప్పుడు కాళేశ్వరం అవినీతి గురించి మాట్లాడిన జీవన్ రెడ్డి ఇప్పుడు పార్టీని వదిలిన తర్వాత అదే ప్రాజెక్టును సమర్థించడం ఆశ్చర్యంగా ఉంది అన్నారు.నాలుగు దశాబ్దాలుగా తాను జీవన్ రెడ్డి వెంట ఉన్న పార్టీ ఎన్నడు మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేదని గౌరవం గానే చూసిందని అన్నారు.రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా అవ్వకముందు కాంగ్రెస్ పార్టీ వెంటిలేటర్ పై ఉంది.. దాన్ని రేవంత్ రెడ్డి బ్రతికించాడు..మీరు ఏ కార్యకర్తను కూడా ధరూరు దాటినివ్వలేదు..నెల రోజులలోనే బి ఆర్ ఎస్ పై మీకెందుకు ఇంత ప్రేమ వచ్చింది..!రేవంత్ ప్రభుత్వం ఎందుకు దిగిపోవాలి.. సంక్షేమ పథకాలు అమలు చేసినందుకా..మీ అనుచరులు డిసిసి అధ్యక్షుడు 20 లక్షలకు కౌన్సిలర్ టికెట్ అమ్ముకున్నాడు అని విమర్శిస్తే మీరు ఎందుకు వారించలేదు..నాలుగు దశాబ్దాలుగా నా నిబద్ధత మీకు తెలియదా..ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీతో మీరు కలిసి పని చేయాలని కోరుతున్నాం..ఈనాటి సమావేశంలో మున్సిపల్ చేర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, మార్కెట్ కమిటీ చేర్మన్ నారాయణ రెడ్డి,కాంగ్రెస్ సేవాదల్ రాష్ట్ర కార్యదర్శి ముఖేష్ ఖన్నా, ఎన్నారై సెల్ కన్వీనర్ చాంద్ పాషా, మైనారిటీ జిల్లా అధ్యక్షులు మన్సూర్ కౌన్సిలర్లు దుమాల రాజ్ కుమార్, చీటి లక్ష్మీనారాయణ, కూతురు రాజేష్, కూతురు శేఖర్, క్యాదాసు నవీన్, ప్రశాంతరావు, రవీందర్ రావు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బీరం రాజేష్, ఎన్. ఎస్. యూ. ఐ అధ్యక్షులు చెట్టె భార్గవ్, మాజీ కౌన్సిలర్ వీరబత్తిని శ్రీనివాస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తాసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్







**ఇబ్రహీంపట్నం మార్చి 4 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :**ఇబ్రహీంపట్నం మండలంలోని రెవెన్యూ కార్యాలయంను సందర్శించిన అడిషనల్ కలెక్టర్ భూభారతి, సదాభాయ్ నామ మరియు పిడిసి ఫైల్ గురించి ఎంక్వయిరీ చేయడం జరిగింది, మరియు వర్షకొండలోని పెద్ద చెరువు యొక్క పెద్ద తూము, చెరువుల వెట్ ల్యాండ్ గురించి ఫారెస్ట్ ఎంపీడీవో అగ్రికల్చర్ ఆఫీసర్ తో సమావేశం నిర్వహించడం జరిగింది, భూభారతి సదాభాయ్ నామ మరియు పిడిసి ఫైల్ గురించి ఎంక్వయిరీ చేయడం జరిగింది, మరియు చెరువుల వెట్ ల్యాండ్ గురించి ఫారెస్ట్ ఎంపీడీవో అగ్రికల్చర్ ఆఫీసర్ తో సమావేశం నిర్వహించడం జరిగింది, తహసిల్దార్, అగ్రికల్చర్ ఆఫీసర్, ఫారెస్ట్,ఎంపీడీవో, ఎస్సై, కార్యదర్శి, సర్పంచ్, ఉప సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ స్కూళ్లపై బురద చల్లడం సరికాదు

## ముల్కనూరులో శ్రీ చైతన్య స్కూల్ టీచర్లపై ట్రస్మా ఆగ్రహం

## కార్పొరేట్ స్కూల్ కహానీలు నమ్మకండి

## అసత్య ప్రచారాలు నమ్మొద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి



**భీమదేవరపల్లి, ఏప్రిల్ 04 (ప్రజా మంటలు) :**కార్పొరేట్ పాఠశాలల పేరుతో బడ్జెట్ స్కూళ్లపై దుష్ప్రచారం చేయడం సరికాదని భీమదేవరపల్లి మండల ట్రస్మా నాయకులు కొండబత్తిని రాజేశం, బేర యాదగిరి హెచ్చరించారు. ముల్కనూర్ గ్రామంలో పనిచేస్తున్న శ్రీ చైతన్య పాఠశాల టీచర్లు ఇతర ప్రైవేట్ పాఠశాలలపై అసత్య ప్రచారం చేస్తున్నారని వారు ఆరోపించారు. ఇందిరానగర్ శ్రీ చైతన్యలో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ఇరుకు గదుల్లో, ఉక్కపోత మధ్య పరిమితికి మించి విద్యార్థులను కూర్చోబెట్టి, అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ముల్కనూర్ గ్రామానికి చెందిన కొంతమంది టీచర్లు గతంలో పనిచేసిన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి, “మాకు టార్గెట్లు ఉన్నాయిడ మీ పిల్లలను మా స్కూల్‌కు పంపండి” అంటూ ఒత్తిడి తెస్తున్నారని ట్రస్మా ప్రతినిధులు తెలిపారు. బడ్జెట్ స్కూళ్లలో అర్హతలేని టీచర్లు ఉన్నారని ప్రచారం చేయడం పూర్తిగా అసత్యమని, భీమదేవరపల్లి మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. శ్రీచైతన్యలో కనీస వసతులు లేక పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర పాఠశాలలకు మార్చిన సంఘటనలు ముల్కనూర్ గ్రామంలోనే అనేకం ఉన్నాయని తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు మా వద్ద ఉన్నాయని, అవసరమైతే ఆధారాలతో బయట పెడతామని స్పష్టం చేశారు. ప్రతి పాఠశాల తన విద్యా ప్రమాణాలు, ఫలితాలు గురించి చెప్పుకోవడం సహజమే కానీ ఇతర పాఠశాలలపై బురద చల్లడం సరైంది కాదని ట్రస్మా నాయకులు హెచ్చరించారు. వెంటనే దుష్ప్రచారం నిలిపివేయాలని, శ్రీ చైతన్యలో పనిచేసే స్థానిక టీచర్లు వాస్తవాలను పిల్లల తల్లిదండ్రులకు వివరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ట్రస్మా నాయకులు చెప్యాల గోపాల్ రెడ్డి, అచ్చ అశోక్, కాశిరెడ్డి ఆదిరెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవాలు



**జగిత్యాల ఏప్రిల్ 4(ప్రజా మంటలు) :** జిల్లా కేంద్రం నిజామాబాద్ రోడ్ లోని, గుట్ట రాజేశ్వర స్వామి దేవాలయం సమీపంలో గత సంవత్సరం నిర్మింపబడిన,శ్రీ లక్ష్మి, గోదా,సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో, ప్రథమ వార్షిక ఉత్సవ వేడుకలు, ఘనంగా జరిగాయి. ఉదయం సత్సంగం,భజనలు, మహా హారతి, అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరిగింది. అనంతరం స్థాపిత 108 కల శాలతో .స్వామి మూలమూర్తికి అభిషేకం,ఫల, పంచామృత,అభిషేకం, జరిగింది. అవభృత స్నానం, మంత్రపుష్పం, అలంకరణ,అనంతరం మహా హారతి జరిగింది. హోమం,పూర్ణాహుతి, శ్రీ లక్ష్మి, గోదాదేవి, శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వచ్చిన భక్తులందరికీ మహా అన్న ప్రసాద వితరణ జరిగింది. . ఈనాటి కార్యక్రమంలో ప్రముఖ జ్యోతిష్య, వాస్తు, పౌరాణిక, పండితులు,శ్రీమాన్ నంబి వేణుగోపాల ఆ చార్య కౌశిక, శ్రీమాన్ నంబి వాసుదేవాచార్య కౌశిక, ఆలయ అర్చకులు రాంజీ మహారాజ్, రాహుల్ మిశ్రా, మరియు గోసం గారి అజయ్ శర్మ, ఆచి శ్రీ విష్ణు చరణ్ ఆచార్య, ఆచి శ్రీరంగ వైభవ్ ఆచార్య, ఆలయ నిర్వహకులు యాంసాని మహేష్, సుజాత, దంపతులు మరియు సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, భక్తులు మాతలు, కార్యవర్గ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఘనంగా ‘గ్రాండ్ పేరెంట్స్ డే‘ వేడుకలు





**సికింద్రాబాద్, ఏప్రిల్ 04 (ప్రజా మంటలు):** సికింద్రాబాద్ బోలాక్పూర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ‘గ్రాండ్ పేరెంట్స్ డే‘ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలలోని నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల తాతయ్యలు, అమ్మమ్మలు, నాయనమ్మలను యాజమాన్యం సాదరంగా ఆహ్వానించింది. వారి కోసం ప్రత్యేకంగా రకరకాల ఆటల పోటీలు, పాటల పోటీలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని గెలుపొందిన వారికి పాఠశాల తరపున బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు, హెడ్ మిస్ట్రెస్ డాక్టర్ మంచాల వరలక్ష్మి ప్రసంగిస్తూ. నేటి ఆధునిక ప్రపంచంలో మారుతున్న జీవనశైలి వల్ల మానవ సంబంధాలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు తమ తాతయ్యలు, అమ్మమ్మల ప్రేమానురాగాలకు దూరం కాకూడదని, వారి మధ్య ఉన్న బంధాన్ని మరింత బలోపేతం చేయాలనే గొప్ప ఉద్దేశంతోనే ఈ వేడుకను ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు.సుమారు 100 మందికి పైగా విద్యార్థుల తాతయ్యలు, అమ్మమ్మలు ఈ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమం అందరిలోనూ ఎంతో ఉత్సాహాన్ని నింపింది.

# విశ్వహిందూ పరిషత్ తరుపున వీర హనుమాన్ విజయ యాత్ర

## హనుమాన్ జంక్షన్ నుండి పాదయాత్ర ప్రారంభించిన

## బజరంగ్ దళ్ కార్యకర్తలు







**మంచిర్యాల్ మార్చి 4 ప్రజా మంటలు :**మంచిర్యాల జిల్లాలో హనుమాన్ శోభయాత్రను ప్రారంభించిన అధ్యక్షులు రాజలింగు కార్యదర్శి వేముల రమేష్ రాజేశం జగ్గాని రవీందర్కనకతార తదితర కార్యకర్తలు మాట్లాడుతూ భారతదేశంలో హిందువుగా బ్రతకాలంటే హిందుత్వాన్ని మర్చిపోకూడదని హిందూ సమాజం ప్రతి ఒక్క హిందువు గుర్తుంచుకోవాలని సనాతన ధర్మాన్ని కాపాడాలని భారతదేశ పౌరుడిగా నిలవాలని బావి భారత పౌరులకు తెలియజేస్తూ హనుమాన్ జయంతి సందర్భంగా ఈ శోభాయాత్ర మహిళలు కోలాటంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుంది ఇప్పుడు జరుగుతున్న మతమార్పిడుల వల్ల ఎంతోమంది హిందువులు తమ ఉనికిని కోల్పోతున్నారని భారతదేశ పౌరుడిగా నిలవాలంటే హిందుత్వం కోసం పోరాడాలని హిందువే బావి భారత పౌరుడిగా నెలకొనాలని ఇప్పుడు జరుగుతున్న పరిణామాలను బట్టి ఇతర దేశ పౌరులు ఏ దేశానికి వెళ్లిన స్వేచ్ఛగా బ్రతుకుతారని మన భారతదేశ పౌరుడు హిందువుగా ఉండి వేరే దేశంలో బ్రతకలేడు అని తెలియపరచడం కోసం హిందుత్వం కోసం విశ్వహిందూ పరిషత్ తరపున ప్రతి ఒక్క భారతీయునికి తెలియజేయడం జరిగినది.

# భక్తిశ్రద్ధలతో ‘రన్ ఫర్ జీసస్

## సికింద్రాబాద్ నుంచి అబిడ్స్ వరకు భారీ ర్యాలీ





**సికింద్రాబాద్,ఏప్రిల్ 04 ( ప్రజామంటలు):** క్రైస్తవ సోదరుల ఐక్యతకు ప్రతీకగా నిలిచే ‘రన్ ఫర్ జీసస్‘ ర్యాలీ శనివారం సికింద్రాబాద్ లో ఘనంగా జరిగింది. ఆదివారం జరిగే ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ఆరాధన టీవీ ఆధ్వర్యంలో జరిగిన ఈ మెగా ఈవెంట్‌లో కాథలిక్, ప్రొటెస్టంట్ విభాగాల ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సికింద్రాబాద్ లోని బసలికా సెయింట్ మేరీస్ చర్చి వద్ద ప్రారంభమైన భారీ ర్యాలీ బైబిల్ హౌజ్, ట్యాంక్బండ్,లిబర్టీ,అబిడ్స్ సెయింట్ జార్జ్ స్కూల్ వరకు కొనసాగింది. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని 800కు పైగా కేంద్రాల్లో ఉదయం 6 గంటలకే ఈ ర్యాలీ ప్రారంభమైందని నిర్వాహకులు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా 40 ప్రాంతాల్లో సుమారు 200 కిలోమీటర్ల మేర సాగిన ఈ కార్యక్రమంలో కార్డినల్ పూల ఆంటోనీ, బిషప్ కె. రూబెన్ మార్క్, బిషప్ ఎ. సిమియోన్, సినీ నటి జయసుధ, సీనియర్ ప్రతినిధులు జెరుసాలెం మత్తయ్య, జాన్సన్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. క్రీస్తు పునరుత్థాన సందేశాన్ని చాటుతూ సాగిన ఈ ర్యాలీలో వేలాది మంది విశ్వాసులు జెండాలు చేతబూని, జీసస్ ప్రార్థనలు చదువుతూ , మరో వైపు క్రైస్తవుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినదిస్తూ ఉత్సాహంగా పరుగెత్తారు. 2011లో చిన్నగా ప్రారంభమైన ఈ కార్యక్రమం, నేడు అతిపెద్ద క్రైస్తవ సామూహిక ఈవెంట్‌గా గుర్తింపు పొందింది.

# మానవత్వమే మిన్న.. వికలాంగులకు అండగా టీజీ ఎస్పీఎఫ్

## -బన్సీలాల్‌పేటలో ఘనంగా అన్నదాన కార్యక్రమం



**సికింద్రాబాద్,ఏప్రిల్ 04 (ప్రజామంటలు):**కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడంలోనే అసలైన తృప్తి ఉందని, సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (టీజీ ఎస్పీఎఫ్) కమాండెంట్ త్రినాథ్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వ ‘ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 2026‘లో భాగంగా, టీజీ ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా ఆదేశాల మేరకు శనివారం సికింద్రాబాద్‌లోని బన్సీలాల్‌పేటలో ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడి ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న సుమారు 450 మందికి పైగా మానసిక మరియు శారీరక వికలాంగులకు టీజీ ఎస్పీఎఫ్ విభాగం ఆధ్వర్యంలో నాణ్యమైన భోజనాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమాండెంట్ త్రినాథ్ మాట్లాడుతూ ...కీలక వ్యాఖ్యలు చేశారు. సమాజంలో శారీరక దృఢత్వంతో అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నవారిని పట్టించుకునేవారు చాలామంది ఉంటారని, కానీ ఏ ఆధారం లేని అనాథలను, వికలాంగులను ఆదుకోవడానికి ముందుకు వచ్చేవారు తక్కువని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఆశ్రమాల్లో ఉన్నవారికి ఒక్క పూట భోజనం పెట్టడం వల్ల కలిగే సంతృప్తి అమూల్యమైనదని, సాటి మనుషుల పట్ల ఇలాంటి సేవా దృక్పథం కలిగి ఉండటం ఎంతో గొప్ప విషయమని ఆయన కొనియాడారు. భవిష్యత్తులోనూ పోలీసు విభాగం తరపున ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ అన్నదాన కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ సన్యాసిరావు, సూపరింటెండెంట్లు కురుమయ్య,విజయ ప్రభలతో పాటు ఎస్సైలు, ఏఎస్సైలు, ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోలీస్ అధికారులు స్వయంగా దగ్గరుండి భోజనాలు వడ్డించడంతో పాటు, ఆశ్రమవాసులతో ఆప్యాయంగా మాట్లాడి వారిలో ధైర్యాన్ని నింపారు. అధికారుల చొరవ పట్ల ఆశ్రమ నిర్వాహకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# అరూరి రమేష్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన

## మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు



**వేలేరు మండలం,ఏప్రిల్ 04 (ప్రజా మంటలు ) :**వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ జన్మదినం సందర్భంగా మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వారికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో జానకీపురం మాజీ సర్పంచ్ మోడెం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులపై సీఎం మౌనం ఎందుకు కవిత



**హైదరాబాద్, ఏప్రిల్ 04:**ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజుల నియంత్రణ బిల్లుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఎందుకు నిర్వహించటం లేదని ప్రశ్నించారు. విద్యా కమిషన్ ముసాయిదా బిల్లు సిద్ధమైనా అమలు చేయకపోవడాన్ని విమర్శించారు.కార్పొరేట్ విద్యాసంస్థల లాబీతో ప్రభుత్వానికి సంబంధాలున్నాయా అని సందేహం వ్యక్తం చేస్తూ, వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.రేపు ‘సేవ్ సింగరేణి’ రౌండ్ టేబుల్ సమావేశం బంజారాహిల్స్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

# కల్తీ మామిడి పండ్లతో తస్మాత్ జాగ్రత్త!

**హైదరాబాద్ సీపీ సజ్జనార్ పోస్ట్ వైరల్**

**కల్తీ మామిడి పండ్లపై జాగ్రత్తగా ఉండాలని సూచించిన సీపీ సజ్జనార్**

**విషపు కోరలు దాగి ఉన్నాయన్న వాస్తవాన్ని విస్మరించొద్దని హెచ్చరిక**

**కాల్షియం కార్బైడ్ వంటి రసాయనాలు ఉపయోగిస్తున్నారని వెల్లడి**



అసలే ఇది నోరూరించే మామిడి పండ్ల సీజన్. మార్కెట్లో ఆ తియ్యటి వాసన సందడి చేసే కాలం. ఈ వేసవిలో నిగనిగలాడుతూ కనిపించే ఈ మామిడి ఫలాల మాటున ప్రాణాంతకమైన విషపు కోరలు దాగి ఉన్నాయన్న వాస్తవాన్ని మర్చిపోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. కొందరు స్వార్థపరులైన వ్యాపారులు డబ్బుల కక్కుర్తి కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సహజ రీతిలో పక్వానికి రావాల్సిన మామిడిని కాల్షియం కార్బైడ్ వంటి కెమికల్స్ వినియోగించి కృత్రిమంగా మగ్గించి విక్రయిస్తున్నారని సజ్జనార్ వెల్లడించారు. రోడ్డు పక్కన బండ్లపై నిగనిగలాడుతూ, గోల్డెన్ కలర్‌లో కంటికి అత్యంత ఆకర్షణీయంగా కనిపించే ప్రతి పండూ నాణ్యమైనదే అనుకొని కొనడమంటే అనారోగ్యాన్ని కొనితెచ్చుకోవడమేనంటూ సోషల్ మీడియా 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

**తింటే అనర్థమే! :** సాధారణంగా సహజంగా పండిన పండు అంతటా ఒకే రంగులో ఉండదని సీపీ సజ్జనార్ అన్నారు. కానీ రసాయనాలతో మగ్గించిన పండ్ల పైన పసుపు పచ్చగా ఉండి, లోపల మాత్రం పచ్చిగా ఉండి విషతుల్యంగా మారుతాయని చెప్పారు. ఇలాంటి పండ్లను తినడం వల్ల గొంతు దగ్గర మంట, వాంతులు, విరేచనాలు, కడుపులో వికారం వంటి తక్షణ సమస్యలతో పాటు, దీర్ఘకాలంలో నాడీ వ్యవస్థ దెబ్బతినడం, శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారని పేర్కొన్నారు.

**కల్తీపై హెచ్-ఫాస్ట్ నిఘా :** ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే ఇలాంటి కల్తీ వ్యాపారుల పట్ల హైదరాబాద్ పోలీస్ విభాగం ఇప్పటికే ఉక్కుపాదం మోపుతోందని సజ్జనార్ స్పష్టం చేశారు. కల్తీ మామిడి పండ్లపైనా హెచ్-ఫాస్ట్ (హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్) పటిష్టమైన నిఘా ఉంచుతోందని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు రూపాన్ని చూసి మోసపోకుండా, సహజత్వాన్ని గుర్తించి పండ్లను కొనుగోలు చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. సహజంగా పండిన పండ్ల కంటే అసహజమైన రంగు, రసాయన వాసన, వింత రుచి కలిగిన మామిడి పండ్ల పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. పండ్లపై అసాధారణ మచ్చలున్నా లేదా బేకింగ్ సోడా నీటిలో కడిగినప్పుడు రంగు మారినా అవి ఆరోగ్యానికి చాలా హానికరమని గ్రహించాలని సూచించారు. కల్తీ మామిడి పండ్ల సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 100కి గానీ, హెచ్-ఫాస్ట్ ఫోన్ నంబర్ 8712661212కు సమాచారం ఇవ్వాలని సజ్జనార్ పోస్ట్‌లో విజ్ఞప్తి చేశారు.

**7 టన్నుల మామిడి పండ్లు స్వాధీనం :** హైదరాబాద్ ఆసిఫ్‌నగర్‌లోని గోదాంలో హెచ్ ఫాస్ట్ అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. మామిడిపళ్లను హానికర రసాయనాలతో మక్కపెడుతున్న వ్యాపారి గోదాంలో సుమారు 7 టన్నుల మామిడిపండ్లు స్వాధీనం చేసుకున్నారు. గోదాం నిర్వాహకులు జమీల్, ఫరీద్‌పై కేసు నమోదు చేసి గోదాంను సీజ్ చేశారు.

# రాష్ట్రంలో మరో నేషనల్ హైవే విస్తరణ

**5 బైపాస్‌లు ఈ మార్గంలోనే!**

**రాజమహేంద్రవరం-అనకాపల్లి హైవేలో 5 బైపాస్‌లు**

**6 వరుసలుగా విస్తరణకు రూ.10,230 కోట్లతో ప్రతిపాదనలు**

**హైవే విస్తరణలో భాగంగా ఐదు చోట్ల బైపాస్‌లు బైపాస్‌లు నిర్మించేలా ప్రతిపాదన**



రాష్ట్రంలో మరో నేషనల్ హైవేను విస్తరించనున్నారు. పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా రాజమహేంద్రవరం నుంచి అనకాపల్లి వరకు ఉన్న నాలుగు వరుసల జాతీయ రహదారిని ఆరు వరుసల రోడ్డుగా విస్తరించనున్నారు. ఈ విస్తరణ పనుల వల్ల ఈ మార్గం గుండా వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గనున్నాయి. ప్రయాణ సమయం కూడా ఆదా అవుతుంది. పూర్తి సమాచారం ఈ కథనంలో తెలుసుకుందాం.చెన్నై-కోల్ కత్తా 16వ నంబర్ జాతీయ రహదారిలో రాజమహేంద్రవరం నుంచి అనకాపల్లి వరకు ఉన్న నాలుగు లేన్ల రోడ్డును ఆరు లేన్లుగా విస్తరించేందుకు రూ.10,230 కోట్ల వ్యయం ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాటిని ఎన్‌హెచ్ఏఐ (జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ) ఉన్నతాధికారులకు పంపించారు.రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్ చెరువు నుంచి అనకాపల్లి వరకు 161 కిలో మీటర్ల మేర నాలుగు లేన్ల హైవేని ఆరు వరుసలుగా విస్తరించాలనే డిమాండ్ ఉంది. దీనికి కొంతకాలం కిందట ఎన్‌హెచ్ఏఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు జిల్లాల వారీగా జిల్లా స్థాయి అధికారులతో సమీక్షలు నిర్వహించారు. ఎలైన్‌మెంట్ పై అభిప్రాయాలను సైతం తీసుకున్నారు.జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఐదు ప్రాంతాల్లో 36.38 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్లు నిర్మించేలా ప్రతిపాదన సిద్ధం చేశారు.జగ్గంపేట వద్ద 10.70 కి.మీ., ఎర్రవరం వద్ద 3 కి.మీ., తుని వద్ద 11 కి.మీ., నక్కపల్లి వద్ద 3.30 కి.మీ., కశింకోట టూ అనకాపల్లి వద్ద 8.38 కి.మీ. మేర బైపాస్ రోడ్లు నిర్మించనున్నారు.హైవే ఆరు లేన్లగా విస్తరణ, ఐదు ప్రాంతాల్లో బైపాస్ రోడ్ల నిర్మాణానికి కలిపి 368 హెక్టార్ల భూసేకరణ చేయాల్సి ఉంటుందని నిర్ధారించారు. ఈ ప్రతిపాదనను కేంద్ర రవాణా, నేషనల్ హైవే మంత్రిత్వశాఖ (మోర్త్)లో ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ ఆమోదం కోసం పంపారు. అక్కడ నిర్ణయం తీసుకుంటే, సాంకేతిక, ఆర్థిక అనుమతులు లభిస్తాయి. అనకాపల్లి టూ సబ్బవరం వయా ఆనందపురం మీదుగా నరసన్నపేట వరకు 152 కి.మీ. మేర ప్రస్తుతం 6 లైన్లగా హైవే ఉంది. రాజమహేంద్రవరం నుంచి అనకాపల్లి వరకు 161 కి.మీ. కూడా ఆరు వరుసలుగా విస్తరిస్తే ఈ మార్గంలో వాహనాలు మరింత వేగంగా తక్కువ సమయంలో వెళ్లే అవకాశం ఉంది. గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు మొదలు: మరో వైపు చెన్నై - కోల్ కత్తా జాతీయ రహదారితో పోర్టును అనుసంధానం చేయడంలో భాగంగా అన్నవరం-వాకలపూడి మధ్య చేపట్టిన గ్రీన్ ఫీల్డ్ రహదారి పనులు మొదలయ్యాయి. చెన్నై-కోల్ కతా జాతీయ రహదారిపై అన్నవరం నుంచి కాకినాడ సమీపంలోని వాకలపూడి లైట్ హౌస్ వరకు 40.62 కిలోమీటర్ల మేర నాలుగు లేన్లుగా ఈ రోడ్డుని విస్తరిస్తున్నారు. రూ.988 కోట్ల వ్యయం అంచనాతో ఈ పనులను పీఎస్‌కే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ దక్కించుకుంది. ప్రాజెక్ట్‌కు అవసరమైన భూమిలో 3 హెక్టార్లు మినహా, మిగిలిన భూసేకరణ పూర్తి కావడంతో కాంట్రాక్ట్ సంస్థ పనులను ప్రారంభించింది. 2 ఏళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తికానుంది.

# భార్యాభర్తల క్షణికావేశం - బలవుతోంది పసి ప్రాణం!

**పిల్లలను చంపి ప్రాణాలు తీసుకుంటున్న కన్నవారు**

**పసివారికి శాపంగా మారుతున్న క్షణికావేశ నిర్ణయాలు**

**ఈ తరహా ఘటనలు ఎక్కువటం ఆందోళనకరం**

**మానసిక కుంగుబాటే ఆత్మహత్యలకు కారణమంటున్న వైద్యులు**

**ఆవేశంతో పిల్లలను చంపుతున్న దంపతులు**



కుటుంబ కలహాలు పచ్చని సంసారాల్లో చిచ్చు రేపుతున్నాయి. సహనంతో సర్దుకుపోవాల్సిన దంపతులు చిన్న చిన్న కారణాలకే కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. కట్టుకున్నవారిపై కోపాన్ని అభం శుభం తెలియని పసికందులపై ప్రదర్శిస్తున్నారు. మనస్పర్థలు, వివాహేతర సంబంధాలు, అనుమానాలు కారణాలు ఏవైనా కావచ్చు. కానీ, బలి అవుతున్నది మాత్రం పసి ప్రాణాలే. తల్లిదండ్రులు క్షణికావేశంలో తీసుకునే అనాలోచిత నిర్ణయాలు చిన్నారులకు శాపంగా మారుతున్నాయి. ఇటీవల ఈ తరహా ఘటనలు ఎక్కువ కావటం కలవర పెడుతోంది. అసలు దంపతుల మధ్య ఏం జరుగుతోంది? కట్టుకున్న వారిపై కోపాన్ని పసి పిల్లల మీద ఎందుకు చూపిస్తున్నారు? దీనిపై మానసిక నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందాం.

**భర్త వేధిస్తున్నాడని :** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఎల్లయ్యగూడెంలోని మాణిక్యం తండాకు చెందిన ప్రవీణ్ పదహారుచింతల తండాకు చెందిన స్రవంతిని 15 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి 12 ఏళ్ల కార్తీక్, పదేళ్ల కౌశిక్ ఇద్దరు కుమారులు. ప్రవీణ్ కొన్నేళ్ల క్రితం మరొక అమ్మాయిని రెండో వివాహం చేసుకున్నాడు. దీంతో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ప్రవీణ్ రోజూ మద్యం తాగి వచ్చి భార్యని వేధింపులకు గురి చేసేవాడు. భర్త వేధింపులు తట్టుకోలేక గత నెల 31న స్రవంతి తన ఇద్దరు పిల్లలకు ఉరేసి, ఆపై తానూ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

**షాపింగ్‌కు తీసుకెళ్లలేదనే! :** బోరబండ పెద్దమ్మ నగర్‌లో నివసించే మురళి వేణు, సత్యవాణి దంపతులకు రుద్రాన్ష్, ధన్విక అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త మురళి విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లి రోజు షాపింగ్‌కు తీసుకువెళ్లమని భర్తను సత్యవాణి కోరింది. అయితే తన తండ్రిని డయాలసిస్ కోసం ఆసుపత్రికి తీసుకెళ్లాలని, మరో రోజు వెళ్దామని వేణు నచ్చజెప్పాడు. ఈ విషయంలో దంపతుల మధ్య వాగ్వాదం జరిగింది. మనస్తాపం చెందిన సత్యవాణి తన ఇద్దరి పిల్లల గొంతు నులిమి, ఆ తర్వాత తానూ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

**పిల్లలతో సహా చెరువులో దూకి :** కర్నూలుకు చెందిన రాజేశ్వరికి, అలంపూర్‌కు చెందిన రాజుతో 14 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు మెదలయ్యాయి. భర్తతో గొడవలు జరుగుతుండగానే భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వచ్చింది. అప్పటికే కంటి సమస్యతో బాధపడుతున్న రాజేశ్వరి వైద్యం చేయించాలని తల్లిని కోరింది. డాక్టర్ లేడు మరునాడు తీసుకెళ్తానని తల్లి చెప్పింది. ఏమైందో తెలీదు, ఉదయం భర్త దగ్గరకు వెళ్తున్నానని తన తల్లితో చెప్పి, ఇద్దరి పిల్లలతో సహా చెరువులో దూకి ప్రాణాలు తీసుకుంది.

**కన్న తండ్రే యముడయ్యాడు :** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం సీతారంనగర్ పులుగోనిపల్లి తండాకు చెందిన రాందాస్ నాయక్, కవిత భార్యాభర్తలు. వీరికి ముగ్గురు కుమార్తెలు ఓ కుమారుడు ఉన్నారు. భర్త కాటన్ మిల్లులో పని చేస్తుండగా, కవిత కూలీ పని చేస్తుంది. ఇద్దరు కుమార్తెలు హాస్టల్‌లో ఉండి చదువుకుంటుండగా చిన్న కుమార్తె, కుమారుడు తల్లిదండ్రుల దగ్గరే ఉంటున్నారు. కొన్నేళ్లుగా రాందాస్ మద్యం సేవించి భార్యతో గొడవపడుతుండే వాడు. పలు మార్లు నచ్చజెప్పినా అతనిలో మార్పు కనిపించలేదు. గత నెల 30న రాత్రి భార్యాభర్తల మధ్య మళ్లీ గొడవ జరిగింది. దీంతో రాందాస్ భార్య కవిత, కుమారుడు హర్ష, కుమార్తె ప్రణీతపై రోకలి, కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన హర్ష, కవిత అక్కడికక్కడే మృతి చెందారు.“ఇలాంటి ఘటనలు ఆకస్మికంగా జరిగుతున్నట్లు అనిపించవచ్చు. కానీ, సైకియాట్రిక్ ప్రకారం ఇది ఎప్పట్నుంచో ఉన్న ఒత్తిడి పెరుగుతూ ఉండటం. వీరికి భావోద్వేగాలను నియంత్రించుకోలేని తీవ్రమైన మనోవేదనతోపాటు ఆలోచనా విధానం, ఇతరులతో మెలిగే తీరు, ఒత్తిడి, మానసిక రుగ్మతలు కారణం కావచ్చు. లేదా ఇంపల్స్ కంట్రోల్ ప్రాబ్లమ్ కూడా ఉండొచ్చు. ఆ సమయంలో వారికి అత్యంత దగ్గరైన వారి తిరస్కరణ, నమ్మక ద్రోహం వంటి వాటిని తట్టుకోలేకపోతే మానసికంగా కుంగిపోయి ఇలాంటి దారుణాలకు ఒడిగడతారు. ఇలాంటి వారికి మొండితనం ఎక్కువగా ఉంటుంది. అవతలి వారు తాము చెప్పిందే వినాలంటారు. కొన్నిసార్లు ఆత్మహత్య చేసుకుంటామని బెదిరిస్తారు కూడా. అదీ కాకుండా చిరాకు, కోపం, ఒంటరిగా ఉండటానికి ఇష్టపడుతుంటారు. వీటితోపాటు భావోద్వేగాలను నియంత్రించుకోలేకపోవవడం వంటి లక్షణాలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి“

# ప్రభుత్వ బడుల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ

**ప్రైవేట్ మాదిరిగా రవాణా సౌకర్యం**

**ఇబ్రహీంపట్నంలో ఏవీఎన్ లేక్ ఫీల్డ్ గ్లోబల్ స్కూల్ ప్రారంభించిన సీఎం**

**పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుప్రభుత్వం**

**విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్న సీఎం రేవంత్ రెడ్డి**



ప్రభుత్వం విఫలమైనందుకే తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేట్ విద్యాసంస్థలకు పంపిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. విద్య అందరికీ అందుబాటులో ఉన్నప్పటికీ నాణ్యత ఉండటం లేదన్న సీఎం రేవంత్ రెడ్డి, ఆరో తరగతి విద్యార్థులు మూడో తరగతి పుస్తకం చదవలేక పోతున్నారన్నారు. పట్టాలు తప్పిన విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ ప్రయత్నించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రవాణా సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. ఏఐ సునామీతో వైట్ కాలర్ ఉద్యోగాలు పోతున్నందున, ప్రత్యామ్నాయంగా మరిన్ని బ్లూ కాలర్ జాబ్‌లు సృష్టించాలన్నారు.వైట్ కాలర్ ఉద్యోగాలకు ప్రత్యామ్నాయంగా : విద్యపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థిపై రూ.లక్ష 8 వేలు ఖర్చు చేస్తోందని, బడ్జెట్‌లో 8.3 శాతం నిధులు కేటాయించిందని సీఎం వివరించారు. అయితే విద్య అందరికీ అందుబాటులో ఉన్నప్పటికీ నాణ్యత లోపించిందని ముఖ్యమంత్రి అన్నారు. ఏఐ తుపానులో వైట్ కాలర్ జాబ్‌లు పోతున్నాయని, దేశ భవిష్యత్తు, ఆర్థిక వ్యవస్థ ప్రమాదం వైపు వెళ్తోందన్నారు. రాష్ట్రంలో ఏటా లక్ష 10 వేల మంది ఇంజినీరింగ్ పూర్తి చేస్తున్నప్పటికీ, సర్టిఫికెట్‌కు తగిన అవగాహన ఉండటం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.“ఈ రోజుల్లో పిల్లలకు రెండేళ్లు రాకముందే తల్లిదండ్రులు పాఠశాలలకు పంపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో నర్సరీ, యూకేజీ, ఎల్‌కేజీ వ్యవస్థ లేదు. ఐదు సంవత్సరాలు నిండిన తర్వాత ఒకటో తరగతి నుంచే చేర్చుకుంటున్నారు. ఉపాధి హామీ కూలీల నుంచి కార్మికుల వరకు పిల్లల్ని నర్సరీ, ఎల్‌కేజీ పంపించాలన్న తాపత్రయంతో వారు ప్రైవేట్ స్కూల్స్ వైపు ప్రయాణం చేస్తున్నారు.వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ ప్రారంభించనున్నాం“ – రేవంత్ రెడ్డి, తెలంగాణ సీఎం

**సర్వేలో ఏం తెలిసిందంటే? :** ప్రభుత్వ పాఠశాలల్లోని ఆరో తరగతి విద్యార్థుల్లో మూడో తరగతి పుస్తకం చదవలేకపోతున్నట్లు సర్వేలో తేలిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ ఎక్కడ గాడి తప్పింది? ఎలా విఫలమైందో రాజకీయాలకు అతీతంగా అందరూ ఆలోచించాలని ముఖ్యమంత్రి కోరారు. వెనకబాటుతనానికి కారణం చదువులేక పోవడమేనని, పేదరికం కాదని ఇటీవల రాష్ట్రంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో తేలిందని సీఎం తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రైవేట్ స్కూళ్ల తరహాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రవాణా ఏర్పాట్లు చేయనున్నట్లు సీఎం చెప్పారు. ఇబ్రహీంపట్నంలో ఏవీఎన్ లేక్‌ఫీల్డ్ గ్లోబల్ స్కూల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు.

**ప్రపంచాన్ని శాసించే పరిస్థితి రావాలి :** చదువుల కోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా దేశంలోనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యా సంస్థలు వస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రపంచంలో ఎక్కడ మంచి విద్యా సంస్థ ఉన్నా, మన దేశానికి పిలుస్తామన్నారు. భారతదేశ యువత ప్రపంచాన్ని శాసించే పరిస్థితి రావాలని కిషన్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఏవీఎన్ విద్యా సంస్థల ఛైర్మన్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.“ఇతర దేశాలకు సంబంధించిన వారు ఇప్పటికే ఇండియాకు వచ్చి చదువుకుంటున్నారు. మన సెంట్రల్ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీల్లో చదువుతున్నారు. ఈ సంఖ్య ఇంకా పెరగాలి. అందుకే ఈ సందర్భంగా నేను ప్రజలకు కోరుతున్నాను. మీరు మీ పిల్లల్ని ఎవరూ కూడా ఇతర దేశాలకు పంపించే ప్రయత్నాలు, ఇబ్బందులకు గురి చేయకూడదు. చాలా వరకు మధ్య తరగతి కుటుంబం అప్పు చేసి, ఆస్తులు అమ్ముకుని ఇతర దేశాలకు చదువు కోసం పంపిస్తున్నారు‘.


# అప్పుల బాధ తట్టుకోలేక కుటుంబంతో ఆత్మహత్యాయత్నం

**పోలీసుల ఎంట్రీతో సీన్ రివర్స్!**

**ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం ఆత్మహత్యాయత్నం**

**బంధువుల సమాచారంతో పోలీసులు అప్రమత్తం**

**దంపతులు, ఇద్దరు పిల్లలు సురక్షితం**



రోడ్డుపై రయ్‌మంటూ వెళ్తున్న ఓ కారు. అందులో భార్యభర్తలు, ఇద్దరు పిల్లలు. భర్త ముఖంలో తీవ్ర నిస్పృహ. భార్య మోహంలో తెలియని కంగారు. ఇంతలో పోలీసు వాహనం ప్రత్యక్షమైంది. భర్త నిర్ఘాంతపోయాడు! భార్య హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకుంది. పోలీసులు సమయానికి రావడంతో కథ సుఖాంతమైంది. లేదంటే విషాదాంతమయ్యేది. అసలింతకీ ఈ కథలో ట్విస్టేంటి?పల్నాడు జిల్లా దుర్గికి చెందిన అమరేంద్రకు భార్య, ఇద్దరు పిల్లలు. పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయాడు. అప్పిచ్చినవాళ్లకు సమాధానం చెప్పుకోలేకపోయాడు. ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. కలిసి చచ్చిపోదాం అంటూ భార్యనూ ప్రేరేపించాడు. దుర్గి నుంచి సంతమాగులూరు వచ్చాడు. స్నేహితుడి వద్ద కారు తీసుకున్నాడు. భార్యపిల్లల్ని అందులో ఎక్కించుకుని ఆత్మహత్య చేసుకోవటానికి బయలుదేరాడు. భయపడిన భార్య త్రివేణి వద్దని వేడుకుంది. ఐనా వినకపోవడంతో గుట్టుగా అత్తమామలకు ఫోన్‌లో సమాచారం ఇచ్చింది.పోలీసుల సడన్ ఎంట్రీ: అమరేంద్ర తల్లిదండ్రులు కంగారుపడ్డారు. విషయాన్ని పోలీసులకు చెప్పి, కాపాడాలని కోరారు. నరసరావుపేట గ్రామీణ ఎస్సై కిషోర్ వెంటనే రంగంలోకి దిగారు. ఫోన్ ట్రేస్ చేశారు. కారు నరసరావుపేట-గుంటూరు రోడ్డులోని డంపింగ్ యార్డ్ వద్ద ఉందని గుర్తించి లొకేషన్ ఆధారంగా కారుని అడ్డుకున్నారు. పోలీసుల సడన్ ఎంట్రీతో అమరేంద్రకు చెమటలు పట్టాయి. త్రివేణి మాత్రం హమ్మయ్య బతికి బట్టకట్టామంటూ ఊపిరిపీల్చుకుంది. పోలీసులు దంపతుల్ని కారు దింపి ఈ టైంలో ఎక్కడికి వెళ్తున్నావంటూ అమరేంద్రను ప్రశ్నించారు. కంగారుపడిన అమరేంద్ర పిల్లలను గుంటూరు ఆస్పత్రికి తీసుకెళ్తున్నానంటూ పొంతనలేని సమాధానాలు చెప్పాడు. పిల్లల మోహం చూసైనా బతకాలనిపించ లేదా అని అమరేంద్రకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు: మండలంలో ఎస్ఆర్‌కేటీ బైపాస్ వద్ద శుక్రవారం (నిన్న) రాత్రి చోటు చేసుకున్న ఘటనపై గ్రామీణ ఎస్సై కిశోర్ తెలిపిన వివరాల మేరకు మాచర్ల నియోజకవర్గం దుర్గి గ్రామానికి చెందిన శ్రీపతి అమరేంద్ర, త్రివేణి దంపతలు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంటారు. వీరికి 5 ఏళ్ల బాబు, 3 ఏళ్ల పాప ఉన్నారు. కుటుంబ పోషణతో పాటు ఇతర కారణాల వల్ల అప్పులు కావడంతో చేసేది లేక ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు. అమరేంద్ర పిల్లలకు ఆరోగ్యం బాగుండటం లేదని, గుంటూరు వెళ్లి చికిత్స చేయించుకొని వద్దామని భార్య త్రివేణి, ఇద్దరు చిన్నారులతో కలిసి కారులో బయల్దేరారు.మార్గం మధ్యలో భార్యతో అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావటం లేదని, అందరం ఆత్మహత్య చేసుకుందామని చెప్పాడు. దీంతో కంగారుపడిన ఆమె విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసింది. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు నరసరావుపేట గ్రామీణ పోలీసులకు సమాచారం అందించారు. గ్రామీణ ఎస్సై తన సిబ్బందితో హుటాహుటిన సాంకేతికత సాయంతో సెల్‌ఫోన్ సిగ్నల్స్ కనుగొని ఉప్పలపాడు బైపాస్ మీదుగా గుంటూరు వైపు వెళుతుండటాన్ని గుర్తించారు. వెంటనే అతడ్ని వెంబడించారు. అప్పటికే ఎస్ఆర్‌కేటీ కాలనీ సమీపంలో బ్రిడ్జి వద్ద కారు నిలిపి ఆత్మహత్యాయత్నం చేసుకునేందుకు ప్రయత్నించగా వారిని పోలీసులు నిలువరించారు.ఆత్మహత్య మంచి పద్ధతి కాదని, నెమ్మదిగా అప్పులు తీర్చుకొని పిల్లలతో సంతోషంగా ఉండాలని హితవు పలికారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు అమరేంద్ర, త్రివేణి, ఇద్దరు చిన్నారులను అప్పగించారు. సకాలంలో స్పందించి నలుగురి ప్రాణాలు కాపాడిన పోలీసులకు పలువురు అభినందనలు తెలిపారు.

# 'పోలీస్ మామలు' గ్రూప్‌కు షాకిచ్చిన ఎస్సై

**డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు తప్పించుకోవడానికి వాట్సాప్ గ్రూప్**

**గోదావరిఖని పట్టణంలో యువకుల వింత ప్లాన్**

**వాట్సాప్ గ్రూప్ లో సడెన్ గా ఎస్సై ఎంట్రీ**



పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల నుంచి తప్పించుకోవడానికి కొందరు యువకులు వేసిన ప్లాన్ బెడిసికొట్టింది. పోలీసుల కళ్లుగప్పేందుకు వారు ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్‌లోకి ఓ ఎస్సై ఎంట్రీ ఇచ్చి వారికి దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు.గోదావరిఖని పట్టణంలో పోలీసులు ఎక్కడెక్కడ తనిఖీలు చేస్తున్నారో తెలుసుకునేందుకు కొందరు యువకులు 'పోలీస్ మామల స్క్వాడ్' పేరుతో వాట్సాప్ గ్రూప్‌ను సృష్టించారు. ఇందులో 1024 మంది సభ్యులు ఉన్నారు. తనిఖీల సమాచారాన్ని గ్రూప్‌లో పంచుకుంటూ, ఆ దారుల్లో వెళ్లకుండా జాగ్రత్తపడేవారు. అయితే ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఓ యువకుడి ఫోన్‌ను పరిశీలించగా ఈ గ్రూప్ వ్యవహారం బయటపడింది.విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై వెంటనే అప్రమత్తమయ్యారు. పట్టుబడిన యువకుడి ఫోన్ నుంచే ఆ గ్రూప్‌లోకి ప్రవేశించారు. ఎస్సై గ్రూప్‌లో చేరడంతో కంగారుపడిన సభ్యులు ఒక్కొక్కరిగా లెఫ్ట్ అవ్వడం మొదలుపెట్టారు. దీంతో ఆ ఎస్సై ఓ వీడియో సందేశాన్ని గ్రూప్‌లో పోస్ట్ చేశారు. “ఏం మామలూ.. బాగున్నారా? మీ ఫోన్ నంబర్లు అన్నీ నా దగ్గర సేవ్ అయి ఉన్నాయి. గ్రూప్ వీడినా లాభం లేదు. త్వరలోనే మీ అందరినీ పిలిపించి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇస్తాం“ అంటూ ఆయన చేసిన హెచ్చరిక ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.పోలీసు తనిఖీల నుంచి తప్పించుకునేందుకు ఇలాంటి గ్రూపులు నడపడం చట్టరీత్యా నేరమని, విధి నిర్వహణకు ఆటంకం కలిగించడమేనని అధికారులు హెచ్చరించారు. గ్రూప్ సభ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com